ఈనాడు
జోగులాంబ గద్వాల
గురువారం అక్టోబరు 24, 2024

ముహూర్తం కుదిరేనా?

గృహనిర్మాణ శాఖకు మంచిరోజులొచ్చేనా!



ధరూరులో పదేళ్లుగా మూతపడిన గృహనిర్మాణ శాఖ కార్యాలయం

గద్వాల, న్యూస్‌టుడే: గతంలో ఐఏవై, ఇందిరమ్మ ఇళ్లు, పీఎంజీవై ఇలా నిరుపేదల గృహ నిర్మాణ పథకాలన్నీ ఒకే గొడుగు కింద ఉండేవి. అధికారులు, సొంత కార్యాలయాలతో గృహనిర్మాణ శాఖ కళకళలాడుతుండేది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గృహనిర్మాణ శాఖను అప్పటి ప్రభుత్వం పక్కన బెట్టేసింది. అందులో పని చేసే అధికారులకు ఇతర శాఖలకు బదిలీ చేసింది. దీంతో సంబంధిత కార్యాలయాలకు తాళం పడింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అప్పట్లోని 64 మండల, 12 డివిజన్ గృహనిర్మాణ శాఖ కార్యాలయాలు మూతపడ్డాయి, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం వల్ల తిరిగి ఈ కార్యాలయాల తలుపులు తెరుచుకోనున్నాయనే ఆశాభావంతో ప్రజలున్నారు.

గృహలక్ష్మి అజమాయిషీ ఎవరికి: ప్రతి నియోజకవర్గానికి గృహలక్ష్మి పథకం కింద 3వేల యూనిట్లు(ఇళ్లు) ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో ప్రతి పంచాయతీ పరిధిలో ఇళ్ల నిర్మాణం, లబ్ధిదారుల ఎంపిక, నిర్మాణ ప్రక్రియ మొదలుకానున్నాయి. దీంతో మళ్లీ గృహనిర్మాణ శాఖ పరిధిలోనే పనులు చేపడుతారా లేక డబుల్‌బెడ్ రూంల నిర్మాణం పనులు చేపట్టిన ర.భ. ద్వారా వీటి పర్యవేక్షణ ఉంటుందా అన్నదానిపై స్పష్టత ఇంకా రాలేదు. అయితే ర.భ. పరిధిలో ఉద్యోగుల కొరత తీవ్రంగా ఉంది. ఉన్న రోడ్లు, ఇతర నిర్మాణాల పర్యవేక్షణకే సిబ్బంది లేని పరిస్థితి ఉంది.

తాజాగా గృహలక్ష్మి ఇళ్ల నిర్మాణం కూడా అప్పగిస్తే పర్యవేక్షణ ఆ శాఖ అధికారులకు మరింత భారం కానుంది. ఈ నేపథ్యంలో గృహనిర్మాణ శాఖ పునరుద్ధరణ వైపే ప్రభుత్వం మొగ్గు చూపే అవకాశం ఉందని జిల్లా స్థాయి అధికారులంటున్నారు.

పర్యవేక్షణ సిబ్బందే ముఖ్యం: గత ప్రభుత్వం నియోజకవర్గానికి వెయ్యి గృహాలు తొలి దశలో ఇవ్వాలని నిర్ణయించింది. తర్వాత మార్పులు చేసి 2వేల యూనిట్లు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. మూడోసారి మార్పులు చేసి 3 వేల ఇళ్ల చొప్పున ఇవ్వనున్నట్లు ప్రకటించింది. మంజూరు నాటికి ప్రభుత్వమే మారింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం లబ్ధిదారుల్లో ఆశలు రేపింది. దీంతో స్థానిక ఎమ్మెల్యేలకు సైతం ఊరట లభించింది. డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలు పూర్తయినా కేటాయింపుల్లో గందరగోళం తలనొప్పిగా మారిన క్రమంలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో ఎమ్మెల్యేలకు కొంత వెసులుబాటు కలగనుంది.


ఉమ్మడి జిల్లాలో 36 వేల యూనిట్లు: ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల పరిధిలో 36 వేల యూనిట్లు రానున్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో గృహలక్ష్మి పథకం కోసం రూ.1,800 కోట్లు నిధులు అవసరం అవుతాయి. ఇంత పెద్దఎత్తున నిధుల వెచ్చిస్తున్న క్రమంలో ప్రత్యేక శాఖ, దానికి ఇంజినీరింగ్ విభాగం, ప్రత్యేక పర్యవేక్షణకు తగిన సిబ్బంది ఉండాలి. దానికి తోడు ప్రభుత్వం ఇంటి నిర్మాణ సొమ్ము మూడు విడుతలుగా ఇవ్వనున్నట్లు ప్రకటించింది. దానికంటూ ప్రత్యేక కార్యాలయాలు, ఆన్‌లైన్ వ్యవస్థ తగిన సిబ్బంది లేకుంటే పథకం డబుల్‌బెడ్ రూమ్‌ల మాదిరిగానే గాడి తప్పే పరిస్థితి ఉంటుంది.

8న బీసీ కమిషన్ రాక

గద్వాల గ్రామీణం, న్యూస్‌టుడే: స్థానిక సంస్థల రిజర్వేషన్ల విషయమై రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు తెలంగాణ బీసీ కమిషన్ నవంబరు 8న జిల్లాకు రానున్నట్లు కలెక్టర్ బీఎం సంతోష్ బుధవారం తెలిపారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల, నారాయణపేట, వనపర్తి జిల్లాలకు సంబంధించి కమిషన్ ఛైర్మన్ నిరంజన్ నేతృత్వంలోని సభ్యులు ప్రజాభిప్రాయ సేకరణ జరపనుందని వెల్లడించారు. తమ అభిప్రాయాలు తెలియజేయాలనుకునే వారు రాత పూర్వకంగా సమర్పణలు, అభ్యర్థనలను నేరుగా సమర్పించవచ్చని సూచించారు. వారి అభ్యర్థనలను నేరుగా నిర్దేశిత నమూనాలో తెలుగు లేదా ఆంగ్లభాషలో ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

నక్షా.. భూమి లెక్క పక్కా!

పైలట్ ప్రాజెక్టుగా జడ్చర్ల



జడ్చర్ల మున్సిపాలిటీ జనాభా: సుమారు లక్ష
వార్డులు: 27
పట్టణంలోని భవనాల సంఖ్య: 11 వేలు

ఈనాడు, మహబూబ్‌నగర్: గ్రామాల్లో వ్యవసాయ భూముల వివరాలు నక్షాలో పకడ్బందీగా ఉంటాయి. పట్టణాల్లో ఆ వ్యవస్థ లేకపోవడంతో ఇష్టారీతిన భూ ఆక్రమణలు జరుగుతున్నాయి. ఇతరత్రా భూ సమస్యలు ఎదురవుతున్నాయి. ఇలాంటి ఇబ్బందులకు చెక్ పెట్టేందుకు పట్టణ భూములకూ నక్షాను అందుబాటులోకి తీసుకురానున్నారు. కేంద్రం పైలట్ ప్రాజెక్ట్‌గా దేశంలోని దాదాపు వంద మున్సిపాలిటీలను ఎంపిక చేయగా రాష్ట్రం నుంచి ఎనిమిది ఉన్నాయి. వీటిలో పాలమూరు నుంచి జడ్చర్ల మున్సిపాలిటీ ఎంపికైంది. త్వరలోనే పట్టణంలో సర్వే ప్రారంభం కానుంది.

సర్వే చేపట్టి.. : భూముల వివరాలను నక్షాలో పొందుపర్చేందుకు సర్వే చేపట్టి పటాలు(మ్యాప్స్) రూపొందించనున్నారు. సర్వే ఆఫ్ ఇండియా, పురపాలక, భూమి కొలతలు దస్త్రాల నిర్వహణ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా సర్వే చేపట్టనున్నాయి. కేంద్ర పథకం నేషనల్ జియోస్పేషియల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ హ్యాబిటేషన్స్(ఎన్‌ఏకేఎస్‌హెచ్) కింద పట్టణాలకు నక్షా తయారు చేయనున్నారు. కొన్నిచోట్ల ఇప్పటికే సర్వే ఆఫ్ ఇండియా డ్రోన్లతో ఎంపికైన పట్టణాల్లో ఛాయాచిత్రాలు రూపొందిస్తోంది. అనంతరం ఆయా శాఖలు సంయుక్త సర్వే చేపట్టనున్నాయి. ఇళ్లు, భూములు, ఆస్తిని పక్కాగా నమోదు చేస్తారు. అక్షాంశాలు, రేఖాంశాలతో ఆస్తుల హద్దులు గుర్తిస్తారు. వాటి విస్తీర్ణాలను డిజిటల్ పద్ధతిలో నమోదు చేస్తారు. ఇల్లు, ఆస్తికి ప్రాపర్టీ కార్డులను కూడా జారీ చేయనున్నారు.

ఆక్రమణలకు అడ్డుకట్ట : జడ్చర్ల పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుండటం, పట్టణం మీదుగా జాతీయ రహదారి వెళ్లడం, హైదరాబాద్‌కు సమీపంలో ఉండటం తదితర సానుకూలాంశాల వల్ల ఇక్కడి భూములకు డిమాండ్ పెరిగింది. అక్రమార్కులు ఇక్కడి ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారు. నక్షాలో ప్రతిదానికి డిజిటల్ హద్దులు నిర్ధారిస్తారు. దీనివల్ల ఆక్రమణలకు అడ్డుకట్ట వేయవచ్చు. ● జడ్చర్ల పురపాలికలోని నల్ల చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దారు. దీని బఫర్, ఎఫ్‌టీఎల్ పరిధిలో కొందరు అక్రమంగా వెంచర్లు ఏర్పాటు చేశారు. వర్షాకాలంలో వెంచర్లలో చెరువు నీరు నిండిపోతోంది. కొనుగోలు చేసిన వారు ఆందోళన చెందుతున్నారు. పరిసరాల్లో కొన్ని నిర్మాణాలు కూడా చేశారు. ● పట్టణంలోని ఊర చెరువు, నల్లకుంట, ఊరకుంట చెరువులు కబ్జా అయ్యాయి. ● బూరెడ్డిపల్లిలో కొన్ని సర్వే నంబర్లలో ప్రభుత్వ భూములు, గుట్టలున్నాయి. వాటి పరిధిలో ఎలాంటి తవ్వకాలు, గనుల ఏర్పాటు, పేలుళ్లు చేపట్టకూడదు. నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడ వెంచర్లు ఏర్పాటు చేసి ప్రభుత్వ భూములను కలిపేసుకుంటున్నారు. యథేచ్ఛగా తవ్వకాలు జరుపుతున్నారు.

● కోసిగుట్ట సమీపంలోనూ కుంటలు, ప్రభుత్వ భూములు కబ్జా అవుతున్నాయి. సర్వే ద్వారా ఈ అక్రమాలు వెలుగు చూస్తాయి.

● బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ పరిధిలో 14 ఎకరాల స్థలం ఉంది. అందులో మార్కెట్ కార్యాలయం, షెడ్లు, ఇతర నిర్మాణాలున్నాయి. రైతులు ఇక్కడికి ధాన్యం, పంట ఉత్పత్తులు తీసుకొచ్చేందుకు 100 అడుగుల విశాలమైన రహదారులుండాలి. మార్కెట్ చుట్టూ నిర్మాణాలు చేస్తున్నారు. ఆ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. రైతులు రాకపోకలు, వాహనాల నిలిపేందుకు స్థలాలు కరవయ్యాయి. రహదారులు ఇరుకుగా మారాయి.

● పట్టణ భూములు, ఆస్తుల సర్వే నిర్వహణకు ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాలేదు. సర్వే వల్ల భూముల లెక్కలు పక్కాగా నమోదవుతాయి. భూ సమస్యలను నివారించవచ్చు. ప్రభుత్వ ఆదేశాలు రాగానే, వాటిని అనుసరించి సర్వే చేపడతాం.
- నవీన్, ఆర్డీఓ మహబూబ్‌నగర్

నల్లమలలో ఆక్రమణలకు అడ్డుకట్ట!

అటవీ భూముల్లో విస్తృతంగా మొక్కల పెంపకం

కొల్లాపూర్, న్యూస్‌టుడే : అటవీ భూముల ఆక్రమణల నివారణకు అటవీశాఖ అధికారులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో విస్తరించిన నల్లమల అడవుల అభివృద్ధిలో భాగంగా కొల్లాపూర్ రేంజ్ పరిధిలో విస్తృతంగా మొక్కల పెంపకం చేపడుతున్నారు. ఆక్రమిత భూములను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకొని మొక్కల పెంపకానికి సిద్ధం చేస్తున్నారు.



ఎర్రగట్టు బొల్లారం శివారులో మొక్కలు నాటుతున్న సిబ్బంది

ఎక్కడెక్కడ.. : కృష్ణా నదీ పరివాహక ప్రాంతం, వాగులకు సమీపంలోని అటవీప్రాంతాల్లోనూ మొక్కల పెంపకం చేపట్టనున్నారు. ప్రస్తుతం నల్లమలలోని ఎర్రగట్టుబొల్లారం శివారులో మొలచింతలపల్లి వాగు సమీపంలో 25 ఎకరాల్లో మొక్కలు నాటారు. వీటి పరిరక్షణకు చర్యలు చేపడుతున్నారు. మిగతా అటవీ భూముల్లో ప్రధానంగా తీరప్రాంతాలైన అమరగిరి, సోమశిల, మల్లేశ్వరం, మంచాలకట్ట, తదితర గ్రామాల్లో నదీ తీర ప్రాంతంలోని అటవీ శాఖ భూముల్లో మొక్కల పెంపకం చేపట్టడానికి అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల ప్రజలకు అడవుల ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. చెట్లను నరకకుండా నిఘా తీవ్రతరం చేశారు. ముక్కిడిగుండం, మారెడ్‌మాన్‌దిన్నె, నార్లాపూర్ తదితర గ్రామాల్లో చెట్లు నరికి పంట సాగు చేసిన పలువురిపై ఇప్పటికే 20 కేసులు నమోదయ్యాయి. ఈ సమస్యపై కొల్లాపూర్ రేంజ్ అధికారి చంద్రశేఖర్ స్పందిస్తూ హక్కుపత్రాలు ఉన్న పోడుభూముల్లో పంటల సాగు చేసుకోవాలన్నారు. కానీ అటవీశాఖకు చెందిన భూముల్లో అక్రమ సాగు చేసే వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భారాస పాలనలో అప్పుల కుప్పగా రాష్ట్రం: మంత్రి

పాలమూరు, న్యూస్‌టుడే : తెలంగాణను అప్పులకుప్పగా మార్చిన భారాస నేతలు.. రాష్ట్రాన్ని బంగారు పల్లెంలో పెట్టి ఇచ్చామని చెబుతున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు. బుధవారం మహబూబ్‌నగర్‌లో ముడా (మహబూబ్‌నగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) ఛైర్మన్‌గా లక్ష్మణ్ యాదవ్ బాధ్యతలను స్వీకరించిన అనంతరం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన భారాస రూ.వేల కోట్లు దోచుకుని దేశంలోని జాతీయ పార్టీల కంటే ఎక్కువగా సంపద పోగేసుకుందని ఆరోపించారు. గత 75 ఏళ్లుగా అనేక పార్టీలు రాష్ట్రాన్ని పాలించినా రూ.70వేల కోట్ల అప్పే అయ్యిందన్నారు. భారాస పాలనలో రూ.6.5 లక్షల కోట్ల అప్పు చేశారని దుయ్యబట్టారు. అందుకే నిరంకుశ, కుటుంబ పాలనను ప్రజలు తిరస్కరించి తమకు పాలన అందించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ అంటే కుటుంబ పార్టీ కాదని, బడుగు బలహీన వర్గాలకు చెందిన పార్టీ అని పేర్కొన్నారు. లక్ష్మణ్ యాదవ్ రెండుసార్లు కౌన్సిలర్‌గా ఎంపికయ్యారని, ఆయనతోపాటు గెలిచిన వారంతా వేరే పార్టీలో చేరినా కాంగ్రెస్ జెండానే నమ్ముకొని ఉన్నారని గుర్తుచేశారు. అందుకే పార్టీ సముచిత ప్రాతినిధ్యం ఇచ్చిందన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ భారాస ప్రభుత్వం ముడా ఏర్పాటు చేసినా దానికి రూపాయి కూడా మంజూరు చేయలేదని మండిపడ్డారు. ముడాను అభివృద్ధి చేయడానికి ముగ్గురం ఎమ్మెల్యేలం కలిసి ముఖ్యమంత్రి సహకారంతో ఎక్కువ నిధులు తీసుకొస్తామన్నారు. తాము అధికారంలోకి వచ్చాక రూ.260కోట్ల అమృత్ నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. యాదవులు నియోజకవర్గంలో ఎక్కువగా ఉన్నారని, ప్రాధాన్యమైన పోస్టును యాదవ బిడ్డకు అప్పగించామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో జడ్పీ, ఎంపీపీ, పురపాలికల్లో పదవులు అన్ని వర్గాలకు దక్కేలా కృషిచేస్తామన్నారు. తొలుత ముడా కార్యాలయంలో ఛైర్మన్ లక్ష్మణ్ యాదవ్ బాధ్యతలు చేపట్టగా మంత్రి, ఎమ్మెల్యేలు, నేతలు అభినందనలు తెలిపారు. అనంతరం ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి సమావేశం నిర్వహించిన ఏనుగొండలోని జేజేఆర్ గార్డెన్ వరకు భారీ వాహన ర్యాలీతో తరలివెళ్లారు. కార్యాలయంలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, అనిరుధ్ రెడ్డి, ఒబేదుల్లా కొత్వాల్, మల్లు నర్సింహారెడ్డి, ఆనంద్‌కుమార్ గౌడ్, అనిత, ఎన్పీ వెంకటేశ్, సంజీవ్ ముదిరాజ్, వినోద్‌కుమార్, మారేపల్లి సురేందర్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, అబ్దుల్ సిరాజ్ ఖాద్రి పాల్గొన్నారు.



ర్యాలీలో మంత్రి జూపల్లి కృష్ణారావు, చిత్రంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అనిరుధ్ రెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, పుర ఛైర్మన్ ఆనంద్‌గౌడ్, ముడా ఛైర్మన్ శ్రీనివాస్ యాదవ్



మొక్కకు నీరు పోస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

ప్రజల మన్ననలు పొందాలి: ఎస్పీ

శాంతినగర్, న్యూస్‌టుడే: ప్రజల మన్ననలు పొందేలా బాధ్యతగా విధులు నిర్వహించాలని ఎస్పీ శ్రీనివాసరావు సిబ్బందికి సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం శాంతినగర్ సర్కిల్ కార్యాలయాన్ని పరిశీలించారు. సర్కిల్ పరిధిలో కేసుల గురించి సీఐ టాటాబాబును అడిగి తెలుసుకున్నారు. ఏ సమస్య ఉన్నా తనదృష్టికి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. స్టేషన్‌కు వచ్చే వారిపట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఎస్సైలు సంతోష్, జగదీశ్, చంద్రకాంత్, విజయభాస్కర్ పాల్గొన్నారు.

వైద్యాధికారుల నియామకానికి ముఖాముఖి

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: గద్వాల జిల్లా ప్రభుత్వాస్పత్రి, అలంపూర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పలు వైద్యాధికారుల నియామకానికి ఈ నెల 25, 26వ తేదీలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకుడు వినోద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ఆస్పత్రి, అలంపూర్ సీహెచ్‌సీలో సీఏఎస్ (స్పెషల్) జనరల్ మెడిసిన్ (3), జనరల్ సర్జన్ (2), గైనకాలజిస్ట్ (4), అనస్తేషియా (2), అలంపూర్‌లో జీడీఎంవో (2) పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా ఆస్పత్రిలోని పర్యవేక్షకుని ఛాంబర్‌లో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

తుంగభద్రలో 1.16 లక్షల క్యూసెక్కుల ప్రవాహం

శాంతినగర్, రాజోలి, న్యూస్‌టుడే: తుంగభద్ర నదిలో బుధవారం 1,16,840 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. జలాశయం నుంచి లక్ష క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద 13.4 అడుగుల ఎత్తులో నీటిప్రవాహం ఉన్నట్లు ఏఈ రాందాస్ తెలిపారు. ప్రధానకాల్వకు 8.5 అడుగుల నీటిని విడుదల చేస్తుండగా, రాష్ట్రానికి వచ్చే సరికి అది 5.7 అడుగులుగా ఉంది. ● తుంగభద్ర డ్యాం నుంచి భారీగా నీటిని విడుదల చేస్తుండటంతో సుంకేసుల జలాశయానికి పెద్ద ఎత్తున వరద పెరిగింది. బుధవారం 1.09 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో 25 గేట్లను ఎత్తి 1.06 లక్షల క్యూసెక్కులను దిగువనున్న శ్రీశైలం జలాశయానికి విడుదల చేస్తున్నామని డ్యాం అధికారులు తెలిపారు. కేసీ కాలువకు 2,400 క్యూసెక్కులు వదులుతుండటంతో 292 మీటర్ల గరిష్ఠ స్థాయి నీటిమట్టం ఉన్న డ్యాంలో.. ప్రస్తుతం 291.30 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లుగా వారు పేర్కొన్నారు. భారీ వరద కారణంగా రాజోలిలోని పెద్ద వాగులో నీళ్లు ఎదురెక్కాయి.



సుంకేసుల నుంచి విడుదలవుతున్న నీరు

ఏడాదిగా జాడలేని నిధులు

ఆరోగ్య మిషన్ అమలులో నిర్లిప్తత

న్యూస్‌టుడే- నారాయణపేట

ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆరోగ్య మిషన్ కింద ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఏటా రూ.కోట్లలో నిధులు సమకూరుస్తోంది. జిల్లాల వారీగా వైద్య ఆరోగ్యశాఖకు ఈ నిధులు బదిలీ చేస్తారు. ఏడాదిగా నిధుల మంజూరులో తీవ్ర నిర్లిప్తత నెలకొంది. ఆరోగ్యమిషన్ నిధులను ప్రతి జిల్లా ఆస్పత్రి, సీహెచ్‌సీలకు రూ.4.50లక్షల చొప్పున, పీహెచ్‌సీకి రూ.1.75 లక్షలు మంజూరు చేయాల్సి ఉంటుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో ప్రతి జిల్లాకు ఏటా కార్యక్రమాల నిర్వహణకు రూ.3కోట్ల నుంచి రూ.5కోట్ల వరకు నిధుల మంజూరు చేయాల్సి ఉంది. ఇంతే కాకుండా ఆస్పత్రుల భవనాలకు, ఇతర కార్యక్రమాలకు అదనపు నిధులు పరిస్థితుల మేరకు వెచ్చిస్తారు. నిధుల్లేక ఏ కార్యక్రమం నిర్వహించాలన్న ఆరోగ్యశాఖ తలలు పట్టుకోవాల్సి వస్తోంది.

జననీ సురక్ష, శిశు యోజన...: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సందర్భంలో మందుల కొనుగోలుకు ఇది వరకు ఒక్కో కేసుకు రూ.1600లు ఖర్చుచేసేవారు. భోజనం ఖర్చుల కింద రోజుకు రూ.వంద వరకు వెచ్చించాలి. సాధారణ ప్రసవానికి మూడు రోజులు, శస్త్ర చికిత్స జరిగితే ఏడు రోజులకు చెల్లించేవారు. కేసీఆర్ కిట్ పేరు మార్చినా నిధులు అందని పరిస్థితి ఉంది.



నారాయణపేట: కొల్లంపల్లిలో నిరుపయోగంగా పల్లె దవాఖానా



ఇదీ పరిస్థితి

జిల్లా	పీహెచ్‌సీలు
మహబూబ్‌నగర్	17
నారాయణపేట	11
నాగర్‌కర్నూల్	23
జోగులాంబ గద్వాల	10
వనపర్తి	14

పారిశుద్ధ్యం అంతంతే: 5వేల జనాభా ఆధారంగా ఆరోగ్య ఉపకేంద్రాలు ఏర్పాటుచేశారు. వీటి నిర్వహణకు జాతీయ ఆరోగ్య మిషన్ నుంచి యేటా నిధులు మంజూరవుతాయి. ఒక్కో కేంద్రానికి రూ.10వేలు కేటాయిస్తారు. కేంద్రం పరిధిలో పారిశుద్ధ్యం, ఇతరత్ర సౌకర్యాలకు నిధులను వినియోగించాల్సి ఉంటుంది. ఏడాదిగా పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది.

కొనసాగని కు.ని శిబిరాలు...: కు.ని శిబిరాల నిర్వహణ, అవసరమైన వసతులు , శస్త్రచికిత్స చేసుకున్న మహిళలకు రూ.800, పురుషులకు రూ.1100 ప్రోత్సాహకం అందజేసేవారు. నిధుల లేమితో రెండేళ్లుగా కు.ని శిబిరాలు నిర్వహించడంలేదు.

పీహెచ్‌సీలలో వసతులు కరవు....: మిషన్ నిధుల జాడలేకపోవడంతో ఆస్పత్రి కమిటీలు ఉత్సాహంగా పనిచేయడం లేదు. వైద్యాధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం లేక సమావేశాలే జరగడం లేదు. పీహెచ్‌సీలలో ఏ చిన్న సమస్య వచ్చినా సొంత ఖర్చులతో నెట్టుకొస్తున్నామని పలువురు వైద్యాధికారులు వాపోతున్నారు.

14 రకాల కార్యక్రమాలు

1 శిశు, మాతృ మరణాల రేటు తగ్గించడం
2. పారిశుద్ధ్యం మెరుగుపరచడం
3. అంటువ్యాధుల నివారణ
4. అసంక్రామిక వ్యాధులపై దృష్టి
5. మలేరియా, డెంగీ రాకుండా చూడటం
6. మరణాల తగ్గింపు
7. కుష్ఠు, క్షయవ్యాధి నివారణ
8. పిల్లల ఆరోగ్యం
9. సార్వత్రిక వ్యాధి నిరోధక సేవలు
10. వ్యక్తిగత పరిశుభ్రత పెంపు
11. కీటక జనిత వ్యాధుల నివారణ
12. కుటుంబ సంక్షేమం
13. గర్భిణుల ఆరోగ్యం
14. బాలింత సంరక్షణ





నిలిచిన ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణాలు. ..: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 352 ఆరోగ్య ఉపకేంద్రాలకు ఒక్కో భవనానికి రూ.16లక్షల నుంచి రూ.20లక్షలకుపైగా నిధులు కేటాయించారు. వీటిలో 94 భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగతా నిర్మాణాలు వివిధ దశల్లో ఉండగా, 30 నిర్మాణాలు నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. నిధుల కొరతతో పనులకు నోచుకోవడం లేదు. పూర్తైన భవనాలను గుత్తేదారులు నిధులు రాలేదని వైద్య ఆరోగ్యశాఖకు అప్పగించడంలేదు.

రైతు సదస్సు విజయవంతానికి చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: గద్వాలలో ఈ నెల 26న నిర్వహించే రైతు అవగాహన సదస్సును విజయవంతం చేయడానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో అన్ని చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ సూచించారు. బుధవారం ఆయన తన ఛాంబర్‌లో రైతు అవగాహన సదస్సు ఏర్పాట్లపై పంచాయతీ, వ్యవసాయ, ఉద్యానవన, డీఆర్‌డీఏ అధికారులతో సమావేశం నిర్వహించారు. గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సదస్సును ఉంటుందన్నారు. సదస్సులో రైతులకు ఉపయోగపడేలా ప్రదర్శనలు, ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేయాలన్నారు. డీపీవో శ్యాంసుందర్, ఉద్యానవన శాఖ అధికారి అక్బర్, డీఏవో సక్రియానాయక్, తదితరులు హాజరయ్యారు.

కాంగ్రెస్ పాలనలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తం

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: పది నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్ర విద్యా వ్యవస్థ అస్తవ్యస్తమైందని బీఆర్‌ఎస్వీ జిల్లా ఆర్డినేటర్ పల్లయ్య ఆరోపించారు. గద్వాలలోని భారాస పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల, నిరుద్యోగుల గురించి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్వీ జిల్లా సమన్వయకర్త పల్లయ్య

అబద్ధపు మాటలతో మోసం చేస్తోందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులను పట్టించుకోకపోవడంతో ప్రైవేట్ విద్యా సంస్థలు రోడ్డెక్కాల్సి వచ్చిందని తెలిపారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాల విద్యా సంస్థలకు అద్దె చెల్లించకపోవడంతో భవన యజమానులు చివరికి తాళం వేసే దయనీయ పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిందని పేర్కొన్నారు. జిల్లా విద్యార్థి విభాగం నాయకులు మాజ్, వీరేశ్, ముని, మత్తాలి, ఖాజావలి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి శాస్త్రవేత్తలకు చక్కని అవకాశం

స్కూల్‌ ఇన్నోవేషన్‌ మారథాన్‌ దరఖాస్తులకు ఆహ్వానం

న్యూస్‌టుడే, గద్వాల న్యూటౌన్‌ : విద్యార్థులు బృందంగా, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో ప్రాజెక్టులు రూపకల్పన చేసేలా కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ 'స్కూల్‌ ఇన్నోవేషన్‌ మారథాన్‌' పేరుతో 2024-25 సంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. నీతి ఆయోగ్‌, ఏటీఎల్‌ ఇన్నోవేషన్‌ మిషన్‌, యూనిసెఫ్‌, కేంద్ర పరిధిలోని ఇన్నోవేషన్‌ విభాగం, ఏఐసీటీఈ సహకారంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. దీనిపై ఇప్పటికే జిల్లా సైన్సు అధికారులు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఇది దోహదపడుతుందని గద్వాల జిల్లా సైన్సు అధికారి బాస్కర్‌ పాపన్న అంటున్నారు.



వివరాలు నమోదు చేసే వెబ్‌సైట్‌ ముఖచిత్రం

6 నుంచి ఇంటర్‌ విద్యార్థులకు

స్కూల్‌ ఇన్నోవేషన్‌ మారథాన్‌ కాంగ్రెస్‌లో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో 6 నుంచి ఇంటర్‌ చదువుతున్న విద్యార్థులందరికీ అవకాశం ఉంటుంది. ఐదు జిల్లాల పరిధిలో మొత్తం 4,500కి పైగా పాఠశాలలుండగా, 190కి పైగా ఇంటర్‌ కళాశాలలున్నాయి. 6 నుంచి 10వ తరగతి వరకు 2.40 లక్షల మంది, ఇంటర్‌లో 35 వేల మందికి పైగా ఉన్నారు. వీరంతా పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది. ఒక్కో పాఠశాల నుంచి బృందంగా విద్యార్థులు ప్రాజెక్టుల రూపకల్పన చేయాలి. ఒక్కరు లేదా ముగ్గురు మాత్రమే బృందంలో ఉండాలి. schoolinnovation-marathon.org అనే వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేస్తే.. విద్యార్థులు, ఉపాధ్యాయునికి ఎంట్రీ కోర్సు నిర్వహిస్తారు. తరువాత వారి ఆలోచనలు అందులో పొందుపరచాల్సి ఉంటుంది.


మానవపాడు ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు

తేదీలు, ఎంపికలు

నవంబరు 30 నాటికి ప్రాజెక్టుల రూపకల్పన చేసి దరఖాస్తుల ప్రక్రియ పూర్తి చేయాలి. వాటిని పరిశీలించి 2025 జనవరిలో 1000 మంది విజేతలను ప్రకటిస్తారు. మేలో విజేతలకు బహుమతులు అందిస్తారు. జులై 29న దేశవ్యాప్తంగా నిర్వహించే అటల్‌ ఇన్నోవేషన్‌ షోలో పాల్గొనాల్సి ఉంటుంది.

● ప్రతి రాష్ట్రం నుంచి 20 బృందాలను విజేతలుగా ప్రకటిస్తారు. ఇంకా 20 బృందాలను గ్రామీణ ప్రాంతాల నుంచి, 20 బృందాలను ప్రభుత్వ పాఠశాలల నుంచి, 20 బృందాలను ఉమ్మడి జిల్లా నుంచి, ప్రత్యేక అవసరాల పిల్లలకు సంబంధించి 20 బృందాలను ఎంపిక చేయనున్నారు.


సామాజిక సమస్యలపై

ప్రాజెక్టులు సమకాలీన సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపేలా ఉండాలి. ఇప్పటికే పరిష్కారం కనుగొని ఉంటే. . ఇంకా మెరుగైన పరిష్కారాలు సూచించేలా ఉండాలి. ఎంపికైన విద్యార్థులకు కేంద్ర మంత్రిత్వ శాఖ నుంచి ప్రత్యేక బహుమతులు, ఉన్నత విద్యకు సహకారం అందనుంది.

కన్నవారే భారమా..!

తల్లిదండ్రులను పట్టించుకోని పిల్లలు

సంక్షేమ కమిటీలు ఏర్పాటు చేస్తున్న సర్కారు



మహబూబ్‌నగర్‌కు చెందిన ఓ వృద్ధుడికి ముగ్గురు కుమారులున్నారు. ఏ ఒక్కరూ పట్టించుకోకపోవడంతో జనరల్‌ ఆస్పత్రిలోని షెడ్డులోనే ఉంటూ దాతలు పెట్టే అన్నం తింటూ బతికారు. ఇటీవల అనాథలా మరణించారు. అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు కుమారులు ముందుకు రాలేదు. చివరకు సామాజిక వర్గం పెద్ద మనుషులు జోక్యం చేసుకోవటంతో ఓ కుమారుడు అంత్యక్రియలు నిర్వహించారు. నవాబ్‌పేట మండలానికి చెందిన ఓ వృద్ధురాలు కుమారులు పట్టించుకోకపోవటంతో పోలీసులను ఆశ్రయించాల్సి వచ్చింది.

న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్‌ పట్టణం

ఎన్నో కష్టాల పడి కని పెంచిన తల్లిదండ్రులు వృద్ధాప్యంలో భారమని కొందరు పిల్లలు భావిస్తున్నారు. వారి ఆలనా పాలనా చూడకుండా గాలికి వదిలేస్తున్నారు. కొందరైతే వారి ఆస్తిపాస్తులను కూడా తమ పేరిట రాయించుకుని ఏకాకిని చేసి ఇంటి నుంచి గెంటేస్తున్నారు. ముదిమి వయసులో ఉన్న వారికి రెండు పూటలా అన్నం కూడా పెట్టని ఉదంతాలు నిత్యం ఏదో ఒకచోట వెలుగు చూస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వృద్ధులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చర్యలపై 'న్యూస్‌టుడే' కథనం.


మహబూబ్‌నగర్‌ జిల్లా జైలు సమీపంలోని వృద్ధాశ్రమానికి ఓ వృద్ధుడిని తరలిస్తున్న జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది

అండగా చట్టాలు



తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం - 2007 ప్రకారం వయోవృద్ధులైన వారి పోషణ బాధ్యత పిల్లలదే. తమ పోషణ విషయంలో పిల్లలను అడిగే హక్కు తల్లిదండ్రులకు ఉంది. క్రిమినల్‌ ప్రొసీజర్‌ కోడ్‌ 1973లో సెక్షన్‌ 125 ప్రకారం తమను తాము పోషించుకోలేని స్థితిలో తల్లిదండ్రులు ఉంటే చట్టమే వారి పోషణ కయ్యే ఖర్చులను పిల్లల నుంచి ఇప్పిస్తుంది. తమ పిల్లలపై ఉన్న ప్రేమతో చాలా మంది తల్లిదండ్రులు కేసులు పెట్టడం లేదు. బాధితులైన వృద్ధులకు ప్రభుత్వం చట్ట ప్రకారం ఆసరా కల్పించేందుకు జిల్లా, మండల, పురపాలిక స్థాయిలో వయోవృద్ధుల సంక్షేమ కమిటీలు (సీనియర్‌ సిటిజన్‌ కమిటీలు) ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేసింది.

ఆదుకునే అధికారులు..



జిల్లా స్థాయి సీనియర్‌ సిటిజన్‌ కమిటీ ఛైర్మన్‌గా కలెక్టర్‌ ఉంటారు. సభ్యులుగా ఎస్పీ, జిల్లా వైద్యాధికారి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి, జిల్లా సంక్షేమ అధికారి, సీనియర్‌ సిటిజన్లు (ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు), ఇద్దరు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఉంటారు. మండల స్థాయి కమిటీ ఛైర్మన్‌గా తహసీల్దారు ఉంటారు. సభ్యులుగా ఎంపీడీవో, ఎస్సై, వైద్యాధికారి, ఇద్దరు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు లేక ఇద్దరు సీనియర్‌ సిటిజన్లు, ఏపీఎం, ఏసీడీపీవో, సంక్షేమ శాఖ సూపర్‌వైజర్లు ఉంటారు. పురపాలికల స్థాయి కమిటీలో కమిషనర్‌ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. సభ్యులుగా మెప్మా పీడీ, సీఐ, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌, సీడీపీవో, ఇద్దరు ఎన్‌జీవోల ప్రతినిధులు లేదా ఇద్దరు సీనియర్‌ సిటిజన్లు సభ్యులుగా ఉంటారు.

ట్రైబ్యునల్‌కు ఫిర్యాదు చేయొచ్చు



ట్రైబ్యునల్‌కు ఫిర్యాదు చేస్తే పిల్లలకు నోటీసులు పంపించి, విచారణ అధికారుల ద్వారా వాదనలు, సాక్ష్యాలు సేకరిస్తుంది. 90 రోజుల వ్యవధిలో పోషణ ఖర్చుల చెల్లింపునకు ఆదేశిస్తుంది. కేసు పునఃపరిశీలనకు, పోషణ ఖర్చులకు ట్రైబ్యునల్‌ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయొచ్చు. పోషణ ఖర్చులు మూడు నెలల పాటు ఇవ్వకపోతే ఆ వృద్ధులు తిరిగి ట్రైబ్యునల్‌ను ఆశ్రయిస్తే ట్రైబ్యునల్‌ ఉత్తర్వులను పాటించని పిల్లలు లేదా బంధువులకు జరిమానా లేక జైలు శిక్షణ విధించే అవకాశం ఉంటుంది.



తల్లిదండ్రులు, వయోవృద్ధులను సంతానం పోషించకుంటే ఫిర్యాదు చేయొచ్చు. తాము నివసిస్తున్న లేదా సంతానం నివసిస్తున్న ప్రాంతం ఆర్డీవో ట్రైబ్యునల్‌కు లేదా జిల్లా మహిళా, శిశు సంక్షేమాధికారికి ఫిర్యాదు చేయొచ్చు. పోషణ ఖర్చులు ఇప్పించమని దరఖాస్తు చేసుకోవచ్చు. టోల్‌ ఫ్రీ నంబర్‌ 14567లోనూ అధికారులకు ఫిర్యాదు చేయొచ్చు.

ఆస్తిపాస్తులు ముందే రాసివ్వొద్దు..



చాలా మంది తల్లిదండ్రులు తాము జీవితాంతం కష్టపడి సంపాదించిన ఆస్తిపాస్తులను పిల్లల పేరిట రాసిస్తున్నారు. మలి దశలో కంటికి రెప్పలా చూసుకుంటారని పిల్లలకు రాసిస్తే తల్లిదండ్రులను ఇంటి నుంచి గెంటేస్తున్నారు. తొందరపడి తల్లిదండ్రులు తమ ఆస్తిని ముందే వారి పేరిట బదలాయించొద్దని న్యాయమూర్తులు, అధికారులు సూచిస్తున్నారు. తల్లిదండ్రులకు ఆస్తిపాస్తులుంటే, వారికి సేవలు చేస్తే తదనంతరం ఎలాగూ వారసత్వంగా పిల్లలకే సంక్రమిస్తాయని వారు చెబుతున్నారు. వృద్ధుల పేరిట ఆస్తి ఉంటే పిల్లలు పోషణ విషయంలో పట్టించుకునే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు.

కమిటీలు న్యాయం చేస్తాయి..



జిల్లా స్థాయిలో రెండేళ్ల క్రితమే కమిటీలు ఏర్పాటయ్యాయి. మండల స్థాయిలో దాదాపు అన్ని చోట్ల ఏర్పాటయ్యాయి. ప్రస్తుతం పురపాలికల్లో కమిటీల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నాం. పిల్లలు పట్టించుకోని తల్లిదండ్రులు ఈ కమిటీలను ఆశ్రయిస్తే న్యాయం చేస్తాయి.

- జరీనా బేగం, జిల్లా మహిళా, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమాధికారి, మహబూబ్‌నగర్‌

విద్యావంతులే నిర్లక్ష్యం చేస్తున్నారు



వృద్ధాప్యంలో తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తున్న వారిలో విద్యావంతులు, ఉన్నతోద్యోగులైన పిల్లలే ఎక్కువగా ఉంటున్నారు. పింఛన్లు వస్తున్న తల్లిదండ్రుల ఏటీఎం కార్డులు లాక్కుంటున్నారు. బ్యాంకు రుణం తీసుకుంటున్నామని సంతకాలు చేయించుకుని ఆస్తి తమ పేరిట రాయించుకుని పట్టించుకోవడం లేదు. చాలా కేసులు మా దృష్టికి రాగా కూర్చోబెట్టి పరిష్కరించాం. రెండు, మూడు కేసులు మాత్రం కలెక్టర్‌, ఎస్పీల ద్వారా ట్రైబ్యునల్‌ వరకు వెళ్లాయి.

- ఎస్‌.జగపతి రావు, సీనియర్‌ సిటిజన్‌ ఫోరం అధ్యక్షుడు, మహబూబ్‌నగర్‌



పడవల్లో ప్రయాణం.. పొంచి ఉన్న ప్రమాదం

నదీ విహారం, ప్రయాణాల్లో లైఫ్‌ జాకెట్లు తప్పనిసరిగా ధరించాలని చెబుతున్నా పెడచెవిన పెడుతున్నారు. అధికార యంత్రాంగం ఎంతగా అవగాహన కల్పించినా అటు ప్రజల్లో, ఇటు బోట్ల యజమానుల్లో మార్పు రావడం లేదు. చాలాచోట్ల నదిలో ప్రమాదాలు చోటు చేసుకుని పదుల సంఖ్యలో వ్యక్తులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. ప్రస్తుతం సోమశిల వద్ద కృష్ణానది నిండుకుండను తలపించేలా ప్రవహిస్తోంది. ఇక్కడ లైఫ్‌ జాకెట్లు ధరించకుండానే ప్రమాదకరంగా నదీ ప్రయాణం చేస్తున్న దృశ్యాన్ని 'ఈనాడు' క్లిక్‌ మనిపించింది.

- ఈనాడు, మహబూబ్‌నగర్‌

కాలుష్యమయం.. రోగాల భయం!



నదిలో స్నానమాచరిస్తే పుణ్యం ప్రాప్తిస్తుందని భక్తుల నమ్మకం. కొల్లాపూర్‌ మండలంలోని సోమశిల వద్ద కృష్ణానదిలో స్నానం చేస్తే పుణ్యం మాట దేవుడెరుగు రోగాలు వస్తాయేమోనని ప్రజలు భయపడుతున్నారు. సోమశిల వద్ద కృష్ణానదిలోని పవిత్ర జలాలు కలుషితమవుతున్నాయి. పుష్కర ఘాట్ల వద్ద నీరు ఆకుపచ్చ రంగులో చమురు తెట్టు కట్టినట్లు దర్శనమిస్తుంది. అక్కడికి వచ్చే పర్యాటకులు ఆ నీటిని చూసి పుణ్యస్నానం చేసేందుకు జంకుతున్నారు. కాళ్లను కడుక్కుని నదికి నమస్కరించి దీపాలు వదిలి దైవ దర్శనానికి వెళ్లిపోతున్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం

నాగర్‌కర్నూల్‌, న్యూస్‌టుడే : ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో రాజీలేని పోరాటం చేస్తామని తెలంగాణ గెజిటెడ్‌ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరు శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం పట్టణంలోని సింగిల్‌ విండో సమావేశం హాల్‌లో టీజీవో జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గెటిటెడ్‌, నాన్‌ గెజిటెడ్‌ అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌ చేశారు. పెండింగ్‌లో ఉన్న అయిదు డీఏలను విడుదల చేయాలన్నారు. జీవో నంబరు 317 సమస్యలను పరిష్కరించాలని, సీపీఎస్‌ విధానం రద్దు చేయాలని డిమాండ్‌ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న 144 మంది తెలంగాణ ఉద్యోగులను వెనక్కి రప్పించాలన్నారు. ఉద్యోగుల పెండింగ్‌ బిల్లులను మంజూరు చేసేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తామని చెప్పారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులుగా రాజశేఖర్‌రావు, అసోసియేట్‌ అధ్యక్షులుగా ఖాజామైనోద్దిన్‌, నాగరాజు, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్‌, నాగేశ్వర్‌రావు, రాజేశ్‌కుమార్‌, కార్యదర్శిగా సంజీవను ఎన్నుకున్నారు. కొత్త కార్యవర్గం సభ్యులతో కలిసి కలెక్టర్‌ బదావత్‌ సంతోష్‌ను కలెక్టరేట్‌లో కలిశారు. కొత్త కార్యవర్గంను కలెక్టర్‌ అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు

26న మద్దూరులో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన


హెలిప్యాడ్‌ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

మద్దూరు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 26న మద్దూరులో పర్యటించనున్నట్లు కాంగ్రెస్‌ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నర్సిములు తెలిపారు. ఇటీవల మరణించిన పార్టీ నాయకుడు కల్లపు సతీశ్‌ దినకర్మకు హాజరై, ఆయన కుటుంబ సభ్యులను సీఎం పరామర్శిస్తారని చెప్పారు. బుధవారం కొడంగల్‌ ప్రాంత అభివృద్ధి సంస్థ(కడా) ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దారు మోహన్‌గౌడ్‌, ఎస్‌ఐ రాంలాల్‌, కాంగ్రెస్‌ నాయకులు హెలిప్యాడ్‌ స్థలాన్ని పరిశీలించారు.

కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు


ముఖద్వారానికి రంగులు వేస్తున్న కార్మికులు

ఆత్మకూరు, న్యూస్‌టుడే : పాలమూరు ప్రజల ఆరాధ్యదైవం కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. నవంబరు 2 నుంచి 18వ తేదీ వరకు జరిగే ఈ వేడుకలకు ఆంధ్రప్రదేశ్‌, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వచ్చే అవకాశం ఉంది. ఈ క్రమంలో దేవాదాయశాఖ, దేవస్థాన పాలక వర్గం బాధ్యులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కంచనగుహపై నిర్మించిన ప్రధాన ఆలయం, లక్ష్మీదేవి, చెన్నకేశవస్వామి, క్షేత్రపాలకులు, ఆంజనేయస్వామి ఆలయాలతో పాటు ముఖద్వారానికి రంగులు, విద్యుదీకరణ పనులు ప్రారంభయ్యాయి. ఆలయ ఈవో మదనేశ్వర్‌రెడ్డి, అర్చకులు వెంకటయ్య, లక్ష్మీనర్సింహ, అనంతవిజయ్‌ తదితరులు బుధవారం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భారీగా బందోబస్తు...

దేవరకద్ర గ్రామీణం, న్యూస్‌టుడే : శ్రీ కురుమూర్తి స్వామివారి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ జానకి తెలిపారు. బుధవారం ఆలయాన్ని సందర్శించి మాట్లాడారు. ఉద్దాల ఉత్సవానికి లక్షల్లో వచ్చే భక్తులకు, స్వామివారి బంగారు ఆభరణాల ఊరేగింపునకు ప్రత్యేక బలగాలతో పాటు, పోలీసు సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రామకృష్ణ, ఎస్సై శేఖర్‌ పాల్గొన్నారు.


జాతర మైదానంలో మాట్లాడుతున్న ఎస్పీ జానకి

దోశ ముక్క గొంతులో ఇరుక్కొని మృతి

కల్వకుర్తి పట్టణం, న్యూస్‌టుడే : దోశ తింటుండగా ఒక్కసారిగా గొంతులో ఇరుక్కోవడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం నాగర్‌కర్నూల్‌ జిల్లా కల్వకుర్తి పట్టణంలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. పట్టణంలోని సుభాష్‌నగర్‌లో నివాసముంటున్న వెంకటయ్య (43) ఉదయం ఇంటి నుంచి వెళ్లాడు. 11 గంటల సమయంలో హోటల్‌ నుంచి దోశ తీసుకుని ఇంటికి వచ్చాడు. కుటుంబసభ్యుల ముందే తింటున్నాడు. గొంతులో ఇరుక్కోవడంతో నీళ్లు తాగుతుండగానే పక్కకు ఒరిగిపోయాడు. కళ్లెదుటే ప్రాణాలు వదలడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. వెంకటయ్యకు భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.


వెంకటయ్య (పాతచిత్రం)

విద్యుదాఘాతానికి వృద్ధురాలు..


గోవిందమ్మ

రాజోలి, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురై రాజోలి గ్రామానికి చెందిన గోవిందమ్మ(62) మృతిచెందింది. స్నానం చేయడానికి బాత్‌రూమ్‌లో వాటర్‌ హీటర్‌ పెట్టబోయింది. ఈ క్రమంలో విద్యుదాఘాతానికి గురైంది. ఇంట్లో ఉన్న వారంతా గృహ ప్రవేశానికి వెళ్లడంతో ఎవరూ గమనించలేదు. పక్కింటి వ్యక్తి గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే వృద్ధురాలు మృతిచెందింది.

కోడి పందాలపై పోలీసుల కొరడా

12 కోడి పుంజులు.. 21 ద్విచక్రవాహనాలు స్వాధీనం

కోడేరు, న్యూస్‌టుడే : కోళ్ల పందెం ఆడుతుండగా సమాచారం రావడంతో స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించి 12 కోడి పుంజులు, 21 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్న సంఘటన బుధవారం నాగర్‌కర్నూల్‌ జిల్లా కోడేరు మండల బాడుగదిన్నె శివారులో చోటు చేసుకుంది. ఎస్సై గోకారి కథనం ప్రకారం.. వివిధ ప్రాంతాలకు చెందిన దాదాపు 70 మందికిపైగా ద్విచక్రవాహనాలపై బాడుగదిన్నె శివారు పొలం వద్దకు చేరారు. రహస్యంగా కోడి పందాలు ఆడుతున్నారు. ఈ విషయంపై డయల్‌ 100కు సమాచారమందింది. ఎస్పీ వైభవ్‌ గైక్వాడ్‌ రఘునాథ్‌ వెంటనే కొల్లాపూర్‌ సీఐ మహేశ్‌ను అప్రమత్తం చేశారు. దీంతో ఆయన కొల్లాపూర్‌, కోడేరు పోలీసులతో బృందంగా ఏర్పడి కోడి పందాలు ఆడుతున్న స్థావరంపై దాడులు నిర్వహించగా పందెంరాయుళ్లు పరారయ్యారు. 12 కోడిపుంజులు, 21 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకొని కోడేరు ఠాణాకు తరలించారు. ఈ ఘనటపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోకారి తెలిపారు. ఎలాంటి నగదు లభ్యం కాలేదని, త్వరలోనే నిందితులను పట్టుకుంటామని పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ: ఒకరి మృతి

కోస్గి గ్రామీణం : ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఒకరు మృతిచెందిన ఘటన గుండుమాల్‌ బుధవారం చోటు చేసుకుంది. బైక్‌మెకానిక్‌ కృష్ణయ్య రాత్రి దుకాణంలో పనులు ముగించుకొని ఇంటికి బయలుదేరాడు. మద్దూరు మండలం దోరెపల్లికి చెందిన మోహన్‌ తన ద్విచక్రవాహనంపై గుండుమాల్‌ వస్తున్నారు. ద్విచక్ర వాహనంపై ఎదురుగా వస్తున్న కృష్ణయ్యను ఢీకొట్టాడు. కృష్ణయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. గాయాల పాలైన మోహన్‌ను కోస్గి ఆసుపత్రికి తరలించారు.

చెంచుల అభ్యున్నతికి చేయూత

లింగాల, న్యూస్‌టుడే: మారమూల గ్రామాల్లో నివాసం ఉంటున్న చెంచుల్లో అక్షరాస్యత తక్కువ ఉన్నందుకు.. అభివృద్ధి సాధించ లేకపోతున్నారని ఎన్‌ఆర్‌ఐ ఝాన్సీలక్ష్మి అన్నారు. నైస్‌ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని ఎర్రపెంటలో బుధవారం చెంచులకు నిత్యావసరాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. చెంచులు మద్యం తదితర దురవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి కుటుంబానికి రూ. 3,500 విలువైన సరకులు అందజేశామని మొత్తం 80 మందికి లబ్ధి చేకూరిందని సంస్థ కార్యదర్శి పూర్ణచంద్రారావు వివరించారు. 5 ఏళ్లపాటు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. ఆర్డీటీ ఏరియా టీమ్‌ లీడర్‌ రాధ, మోక్ష తదితరులు పాల్గొన్నారు.


చెంచులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఎన్‌ఆర్‌ఐ ఝాన్సీలక్ష్మి, నైస్‌ సంస్థ కార్యదర్శి పూర్ణచంద్రారావు

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

వనపర్తిగ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చిట్యాల మహాత్మ జ్యోతి బా పులే బాలుర గురుకుల పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా పోటీలను ప్రిన్సిపల్‌ గురువయ్యగౌడ్‌తో కలిసి చిన్నారెడ్డి క్రీడా జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో, చదువులో నైపుణ్యాన్ని, చిత్తశుద్ధిని ప్రదర్శిస్తే తమ లక్ష్యాన్ని చేరుకుంటారన్నారు. రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లా నుంచి ఎక్కువ క్రీడకారులు ఎంపిక కావాలని సూచించారు. అంతకుముందు విద్యార్థులు నిర్వహించిన క్రీడా వందనాన్ని స్వీకరించారు. అనంతరం వాలీబాల్‌ క్రీడా ప్రారంభోత్సవం వాలీబాల్‌ను త్రో చేసి విద్యార్థులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్‌ సొసైటీ అధికారి హర్షవర్ధన్‌రెడ్డి, హాకీ వ్యాయామ డైరెక్టర్‌ కుమార్‌, ఎస్‌ఎంఎస్‌ ఛైర్మన్‌ రాజు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


వాలీబాల్‌ పోటీలను ప్రారంభిస్తున్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

ఎక్లాస్‌పూర్‌ అడవుల్లో చిరుతల సంచారం

పాతబస్టాండ్‌(నారాయణపేట), న్యూస్‌టుడే : నారాయణపేట మండలం ఎక్లాస్‌పూర్‌ ఎకో పార్కు పరిసరాల్లో చిరుతలు సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. 250 ఎకరాలకు పైగా అటవీప్రాంతం కోయిలకొండ వరకు గుట్టలు, చెట్లతో విస్తరించి ఉంది. ఇటీవల లేగదూడలు, మేకలు, ఆవులను చిరుతలు చంపుతున్నాయి. ఎకో పార్కులో ఓ చిరుత సంచరించడం అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది. బుధవారం ఎకో పార్కు కమాన్‌ వద్ద బొమ్మ చిరుత వద్దకు అసలైన చిరుత చేరుకుని కాసేపు అక్కడే నిలిచిన వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. ఈ విషయాన్ని 'న్యూస్‌టుడే' అటవీ శాఖ అధికారి నవీన్‌కుమార్‌రెడ్డితో ప్రస్తావించగా చిరుత సంచారం వాస్తవమేనన్నారు. ఎకో పార్కు ఆటవీ ప్రాంతంలో దాదాపు 10 నుంచి 15వరకు చిరుతలు ఉన్నట్లు ఆయన తెలిపారు. రైతులు, ప్రజలు ఒంటరిగా వెళ్లవద్దన్నారు. రాత్రి వేళల్లో సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

చికెన్‌ ధరలు



ఫాంరేటు	120-00
రిటైల్‌	142-00
డ్రెస్డ్‌	206-00
స్కిన్‌లెస్‌	234-00

తెరపై ఈనాడు

గద్వాల: ఎస్వీసీ సినిమాస్.. దేవర, విశ్వం, జనక అయితే గనక, అయిజ: శివసాయి : దేవర, భువనేశ్వర్ : విశ్వం మాధవ్ : వేట్టయన్

-న్యూస్‌టుడే, గద్వాల గ్రామీణం, అయిజ

వర్షాలకు దెబ్బతిన్న రహదారులకు మోక్షం



వర్షాలకు దెబ్బతిన్న భైరాపురం రహదారి

గద్వాల, న్యూస్‌టుడే: జోగులాంబ గద్వాల జిల్లాలో గత నెలలో కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల పరిధిలో పలు చోట్ల కాజ్‌వేలు, రహదారులు కోతకు గురయ్యాయి. అయితే పంచాయతీరాజ్, ర.భ అధికారులు పంపిన ప్రతిపాదనల్లో సగం వరకు కోత పెట్టి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు తెలిసింది. ప్రస్తుతం వచ్చిన నిధులు శాశ్వత మరమ్మతులకు సరిపోయే పరిస్థితుల్లేక పోగా తాత్కాలిక మరమ్మతులు చేయనున్నట్లు తెలిసింది. అందుకు సంబంధించి టెండర్లు పిలిచి పనులు అప్పగించనున్నట్లు సమాచారం.

మండలం	పనుల సంఖ్య	మంజూరైన నిధులు (రూ. లక్షల్లో)
గద్వాల	3	12.50
మల్దకల్	4	17.50
రాజోలి	1	18.00
అయిజ	1	1.30
ఇటిక్యాల	3	15.00
వడ్డేపల్లి	2	10.00

రూ.78.30 లక్షల మంజూరు

జిల్లాలో మొత్తం 7 మండలాల పరిధిలోని 18 రహదారులు దెబ్బతిన్నాయి. వాటికి తాత్కాలిక మరమ్మతులకు వరద సహాయ నిధి కింద పంచాయతీ రాజ్ శాఖ ద్వారా రూ.78.30 లక్షలు మంజూరైనట్లు తెలిసింది. అత్యధికంగా అలంపూరు నియోజకవర్గంలో 11 రహదారులు దెబ్బతినగా గద్వాల మండలంలో 7 రహదారులు దెబ్బతిన్నాయి. అలంపూరు నియోజకవర్గానికి 11 రహదారుల మరమ్మతులకు రూ.48.30 లక్షలు మంజూరు కాగా గద్వాల నియోజకవర్గంలో రహదారుల మరమ్మతులకు రూ.30 లక్షలు మంజూరయ్యాయి. జిల్లాలో దెబ్బతిన్న రహదారులకు వరద సహాయ నిధి కింద ఇవి మంజూరయ్యాయి. త్వరలోనే మరమ్మతులు ప్రారంభిస్తామని పంచాయతీ రాజ్ శాఖ ఈఈ దామోదర్‌రావు తెలిపారు.

గవర్నర్‌ను కలిసిన పీయూ ఉపకులపతి



గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉపకులపతి జీఎన్ శ్రీనివాస్

పాలమూరు, న్యూస్‌టుడే : రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను పాలమూరు విశ్వవిద్యాలయం నూతన ఉపకులపతి డా.జీఎన్ శ్రీనివాస్ హైదరాబాద్ రాజ్‌భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈయనతో పాటు పలు విశ్వ విద్యాలయాల ఉపకులపతులు బుధవారం గవర్నర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

తాగునీటికి ఇబ్బందులు



ప్రాగటూరులో ఖాళీ బిందెలతో నిరసన చేస్తున్న ప్రజలు

ఉండవల్లి, న్యూస్‌టుడే: మండలపరిధి ప్రాగటూరు గ్రామంలోని బీసీ కాలనీలో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నట్లు సీపీఎం నాయకుడు సింగరాజు మద్దిలేటి ఆధ్వర్యంలో పలువురు ప్రజలు ఖాళీబిందెలతో బుధవారం నిరసన తెలిపారు. గ్రామ సమీపంలో కృష్ణానది ఉన్నా తాగునీటికి అవస్థ పడాల్సి వస్తోందని వారు తెలిపారు. రూ.5 లక్షలతో 6 నెలల కిందట పైప్‌లైన్ వేసి అసంపూర్తిగా వదిలేసినట్లు పేర్కొన్నారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే మండల కార్యాలయాల ముందు ధర్నా చేస్తామని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. ఈ విషయంపై మిషన్ భగీరథ అధికారి హర్షద్‌ను అడగ్గా.. గ్రామానికి ఇటీవల పత్తి పంట తీసేందుకు 100 మందికి పైగా కూలీలు వచ్చారని వారు 2 నెలల పాటు ఇక్కడే ఉంటారని తాగునీటి సమస్య లేకుండా చూస్తామన్నారు.

తుమ్మలచెర్వులో వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

ధరూరు, ఉండవల్లి, న్యూస్‌టుడే: గట్టు మండలం తుమ్మల చెర్వు గ్రామంలో బుధవారం వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. కార్యక్రమంలో భారాస నేత హనుమంతునాయుడు, నడిగడ్డహక్కుల నేత రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొని పూలమాలలు వేసి వాల్మీకి సేవలను కొనియాడారు. సందెరాళ్లు, ఇతర పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు: ఉండవల్లి అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామావళి, మంగళ హారతి వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు ధర్మకర్త దామోదర్‌రెడ్డి తెలిపారు. అయ్యప్ప మాలధారణ స్వాములు శరణుఘోషతో స్వామిని స్మరించుకున్నారు.

సుభిక్షంగా ఉండాలని భాగవత సప్తాహం



పారాయణం చేస్తున్న చిన్నజీయర్ స్వామి శిష్యులు

మల్దకల్, న్యూస్‌టుడే: అందరూ సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ అమరవాయిలోని సీతారామాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం భాగవత సప్తాహ పారాయణం భక్తి శ్రద్ధలతో ప్రారంభమైంది. ఆలయంలో మూడు రోజుల పాటు మాదక్కగారి వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో విశ్వహిందూ పరిషత్తు, శ్రీరామానుజ త్రిదండి చిన్నజీయర్‌స్వామి ఆదేశాలతో వారి శిష్యబృందం వారిచే భాగవత పారాయణ ఘట్టాలు వినిపించారు. రోజు 10 గంటల పాటు పారాయణం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

బాధ్యతగా విధుల నిర్వహణ: ఎస్పీ

మానవపాడు, న్యూస్‌టుడే: ప్రజల మన్ననలు పొందేలా పోలీసులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం మానవపాడు ఠాణాలో దస్త్రాలను పరిశీలించారు. ఏయే కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. రౌడీషీటర్లు, అనుమానితులు, సంఘ విద్రోహశక్తులపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. ప్రాపర్టీ కేసుల్లో అలసత్వం వహించకుండా సకాలంలో ఛేదించేలా దృష్టి సారించాలని ఎస్సై చంద్రకాంత్‌కు సూచించారు. పోలీసు సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డయల్-100 కాల్ రాగానే వెంటనే స్పందించి సంఘటనా స్థలానికి చేరుకొని సమస్యను పరిష్కరించాలన్నారు. అనంతరం ఠాణా పరిసర ప్రాంతాలను పరిశీలించడంతో పాటు మొక్క నాటారు. శాంతినగర్ సర్కిల్ సీఐ టాటాబాబు, తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణ పేరుతో దోపిడీ: భాజపా



మాట్లాడుతున్న భాజపా జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

అయిజ, న్యూస్‌టుడే: ఎలాంటి రుసుము లేకుండా ప్లాట్లను క్రమబద్ధీకరిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు దోపిడీకి తెరలేపిందని భాజపా జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి విమర్శించారు. బుధవారం అయిజలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడారు. జీహెచ్ఎంసీ పరిధిలో రూ.450 కోట్లు, హెచ్ఎండీఏ పరిధిలో రూ.1000 కోట్లు రాష్ట్ర ఖజానాలోకి వచ్చే విధంగా ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసిందని ఆరోపించారు. పేద, మధ్య తరగతికి చెందిన డొక్కాడని కుటుంబాలు డబ్బులు కూడగట్టుకొని సొంతింటి కల నెరవేర్చుకునే తరుణంలో ప్రభుత్వం ఇలాంటి దారుణానికి ఒడిగడితే పేదల తరఫున పోరాటం చేస్తామన్నారు. వెంటనే మార్గదర్శకాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు భీమ్‌సేన్‌రావు, వెంకటేశ్‌యాదవ్, భగత్‌రెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

పశు సంరక్షణకు ప్రాధాన్యం

ధరూరు, న్యూస్‌టుడే: పశుసంరక్షణ కోసం ప్రత్యేక శిబిరాలను వేసి వైద్య సహాయం అందిస్తున్నామని జిల్లా పశువైద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం గోర్లఖాన్‌దొడ్డి గ్రామంలో పశువైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. గాలికుంటు వ్యాధి నివారణ, పాల ఉత్పత్తి పెంచటం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు రైతులకు వివరించారు. గ్రామాల్లో భవిష్యత్ భారత్ మైండ్ ట్రీ సంస్థ సహకారంతో వైద్య శిబిరాలతో పాటు రైతులకు అవగాహన కల్పిస్తున్నామని ఆయన తెలిపారు.

నీరు సరిపోవడం లేదు సారూ!



కార్యదర్శికి సమస్యను వివరిస్తున్న గ్రామస్థులు

రాజోలి, న్యూస్‌టుడే: పునరావాస గృహాల వద్ద ఎలాంటి నీటి వసతి లేదని, వచ్చే మిషన్ భగీరథ నీరు సరిపోవడం లేదంటూ గ్రామస్థులు రాజోలి కార్యదర్శికి విన్నవించారు. కొన్ని రోజులుగా నీటి సమస్య నెలకొందని ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో కార్యదర్శి కృష్ణ, నీటి సరఫరా అందించే సిబ్బందితో వెళ్లి పునరావాస గృహాల వద్ద ప్రజలతో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. 15 రోజులుగా నీరు సరిగా రావడం లేదు. తాగేందుకు, అవసరాలకు సరిపోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు అన్నారు. వచ్చే నీటిని ఎక్కువ సమయం వదలాలని దీనివల్ల సమస్య పరిష్కారం అవుతుందని జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు నిషాక్ కార్యదర్శిని కోరారు.

కూలిన రక్షణ గోడ



ఎల్కూరు నుంచి ఉడుందపురం వెళ్లే దారిలో వంతెనపై నిర్మించిన రక్షణగోడ కూలడంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో వాహన చోదకులు ప్రమాదాలకు లోనయ్యే అవకాశాలున్నాయని భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారుల దృష్టికి తెచ్చినా చర్యలు లేవని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కూలిన రక్షణ గోడకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. పీఆర్ ఏఈ బషీర్‌ను సంప్రదించగా ప్రతిపాదనలు పంపుతామన్నారు.

-న్యూస్‌టుడే, మల్దకల్

శుభ్రం చేశారు

మానవపాడులోని ఎంపీడీవో కార్యాలయం వెనక వైపు ఓ గది గత కొంత కాలంగా నిరుపయోగంగా ఉంది. గదిలో ఖాళీ మద్యం సీసాలు, నీళ్ల బాటిళ్లు, గ్లాసులు వంటి ఇతర వ్యర్థాలు నిల్వ ఉన్నాయి. ఈ నేపథ్యంలో 'అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా' శీర్షికన ఈ నెల 22వ తేదీన 'ఈనాడు' దినపత్రికలో వార్త ప్రచురితమైంది. సంబంధిత అధికారులు స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందితో గదిలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు.

-న్యూస్‌టుడే, మానవపాడు



శిథిలావస్థలో కాజ్‌వే



వడ్డేపల్లి నుంచి రాజోలికి వెళ్లే మార్గంలో పాల వాగు వద్దనున్న కాజ్‌వే శిథిలావస్థకు చేరింది. రెండువైపులా రంధ్రాలు ఏర్పడ్డాయి. దీంతో రాత్రి వేళల్లో ప్రయాణించడానికి ద్విచక్రవాహనదారులు భయపడుతున్నారు. ఎదురుగా కార్లు, లారీలు, ఆటోలు వంటివి వస్తే ఆగాల్సిందే. ఒక్క వాహనమే వెళ్లేందుకు అవకాశం ఉంది. లేదంటే వాహనాల టైర్లు ఈ రంధ్రాల్లో ఇరుక్కునే ప్రమాదం ఉంది. అధికారులు దీనిపైన దృష్టిపెట్టి రంధ్రాలను కాంక్రీట్‌తో సరిచేయించాలని ప్రజలు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, శాంతినగర్

ఒక్క కుళాయే దిక్కు

రాజోలిలోని న్యూప్లాట్స్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో 180 మందికి పైగా విద్యార్థులుండగా, వీరు తాగేందుకు, మధ్యాహ్న భోజన సమయంలో చేతులు, ప్లేట్లు శుభ్రం చేయడానికి ఒక్క కుళాయి మాత్రమే ఉంది. సమస్యను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ఖాజామొహినుద్దీన్ తెలిపారు.

-న్యూస్‌టుడే, రాజోలి





మిథున్ తేజను స్వాగతిస్తున్న న్యాయవాదులు

అలంపూర్ న్యాయమూర్తిగా మిథున్ తేజ

అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ న్యాయమూర్తిగా బుధవారం మిథున్ తేజ బాధ్యతలు స్వీకరించారు. కొల్లాపూర్ నుంచి అలంపూర్ కోర్టుకు ఆయన బదిలీపై వచ్చారు. స్వామి, అమ్మ వార్లను దర్శించుకున్నారు. బార్ అసోసియేషన్ కార్యాలయంలో అధ్యక్షుడు సురేష్ కుమార్ ఆధ్వర్యంలో స్వాగతం పలికి పుష్ప గుచ్ఛం అందజేశారు. న్యాయవాదులు నారాయణరెడ్డి, యూదుర్బాష, యాకోబు, తిమ్మారెడ్డి, నాగరాజు, రాజేశ్వరి, వెంకట్రాముడు, సునీల్, ఉమాపతి, తదితరులున్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాలపై దృష్టి

అయిజ, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో వెంకటయ్య పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్తు కార్యాలయంలోని సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో మురుగు, తాగునీటి సమస్యలను ఎప్పటికప్పుడు తీర్చాలని సూచించారు. దీనికితోడు వచ్చే ఏడాది చేపట్టబోయే ఉపాధి పనుల ప్రణాళికను తయారు చేయాలని సూచించారు. నర్సరీల నిర్వహణ ఎలా ఉందనేదానిపై పరిశీలించాలన్నారు.

ఆత్మగౌరవ సభను విజయవంతం చేద్దాం



గోడపత్రికలను విడుదల చేస్తున్న నాయకులు

మానవపాడు, న్యూస్‌టుడే: నాగర్‌కర్నూల్‌లో ఈ నెల 27వ తేదీన మాలల ఆత్మగౌరవ సభ ఏర్పాటుచేసినట్లు మాల మహానాడు జిల్లా నాయకులు రంగముని, మునిస్వామి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో మాలల ఆత్మగౌరవ సభకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సభకు రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యేలు, మాలమహానాడు సంఘం రాష్ట్ర ముఖ్య నాయకులు హాజరుకానున్నట్లు వివరించారు. నాయకులు రామకృష్ణ, నరసింహులు, మహేష్, పెద్ద శ్రీనివాసులు, భీముడు, చిన్న శ్రీనివాసులు, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన సత్రానికి భవనం అప్పగింత

అలంపూర్, న్యూస్‌టుడే: ప్రసాద్ పథకంలోని కింది అంతస్తులో నిర్మించిన బ్లాక్‌ను అలంపూర్ ఆలయాలకు అన్నదాన సత్రం కోసం పర్యాటక శాఖ డిప్యూటీ ఇంజినీర్ పరుషవేది బుధవారం ఈవో పురేందర్, ఛైర్మన్ నాగేశ్వర్‌రెడ్డికి అప్పగించారు. ఈ బ్లాక్‌లో అన్నదాన సత్రం ఏర్పాటు చేసుకుని భక్తులకు అన్నదానం చేసేందుకు పర్యాటక శాఖ అధికారులు అప్పగించారు.

ప్రాంతాలు సందర్శిస్తూ.. విషయాలు తెలుసుకుంటూ..



ఇటిక్యాల: పత్తిపొలంలో రైతులతో సివిల్ సర్వీస్ శిక్షణ అభ్యర్థులు

ఇటిక్యాల, ఉండవల్లి, మల్దకల్, మానవపాడు, న్యూస్‌టుడే: జిల్లాకు వచ్చిన సివిల్ సర్వీస్ శిక్షణ అభ్యర్థులు గ్రామాల్లో తిరుగుతూ పలు అంశాలు తెలుసుకుంటున్నారు. కోదండాపురంలో బస చేస్తున్న వారు బుధవారం పొలం బాట పట్టారు. పత్తి, వరి, మిర్చి పంటలను పరిశీలించారు. అనంతరం గ్రామంలో చౌకధర దుకాణాలను పరిశీలించారు. ఎంపీడీవో అజర్ మొయినుద్దీన్, వ్యవసాయ అధికారి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు. ● ఉండవల్లి మండలంలోని బస్వాపురం గ్రామంలో మహిళా పొదుపుసంఘం సభ్యులతో మమేకపై వారి సాధకబాధకాలను తెలుసుకున్నారు. సంఘాలలో చేరక ముందు చేరిన తర్వాత అభివృద్ధి గురించి మహిళలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో తిరుపతయ్య, ఏపీఎం కోటేశ్వరి, తదితరులు పాల్గొన్నారు. ● మల్దకల్ మండలం పెద్దతండాలోని పల్లెప్రకృతి వనం, డంపింగ్‌యార్డు, పాఠశాలలు, ఉపాధి హామీ పనులు పరిశీలించారు. ఒక్కొక్కటిగా పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమ ఫౌండేషన్ వారు ఏర్పాటు చేసిన సంచులు విద్యార్థులకు పంపిణీ చేశారు. ● మానవపాడు మండలం కలుకుంట్లలో స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశమయ్యారు. ఏయే వ్యాపారాలు చేసుకుంటున్నారనే తదితర వివరాలను శిక్షణ అధికారులు సంఘాల సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో భాస్కర్, ఏపీఎమ్ భీమన్న తదితరులు పాల్గొన్నారు. ఆశ్రమ ఫౌండేషన్ వారు ఏర్పాటు చేసిన బ్యాగ్స్, మ్యాట్‌ను పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం

శాంతినగర్, న్యూస్‌టుడే : విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం వడ్డించాలని జిల్లా సెక్టోరియల్ అధికారి శాంతిరాజ్ అన్నారు. బుధవారం శాంతినగర్‌లోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను పరిశీలించిన ఆయన వంట ఏజెన్సీలకు చెందిన వారితో మాట్లాడారు. పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని, ఫిర్యాదులు వస్తే చర్యలుంటాయన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఎస్ఏ 1 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలనీ, పాఠశాలల్లో పరీక్షల టైం టేబుల్ బోర్డుపై రాయాలన్నారు. విద్యార్థుల నమోదు ఆన్‌లైనులో, ఫిజికల్‌గా సమానంగా ఉండాలన్నారు. హెచ్‌ఎంలు జీవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి



నిరసనలో మాట్లాడుతున్న ఈదన్న

ఉండవల్లి, న్యూస్‌టుడే: గద్వాల జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జీకే.ఈదన్న డిమాండు చేశారు. బుధవారం ఉండవల్లిలో సంఘం సభ్యులు మద్దిలేటి ఆధ్వర్యంలో రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. పత్తి పంటను రైతులు అమ్మేందుకు సిద్ధంగా ఉన్న కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో దళారులకు విక్రయించి నష్టపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ప్రభుత్వం సహకరించాలన్నారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రైతులు లక్ష్మన్న, మక్బూల్‌భాష, మద్దిలేటి, ఎర్రన్న, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాదేపల్లి మార్కెట్‌లో క్వింటాలు పత్తి రూ.6,379

జడ్చర్ల, న్యూస్‌టుడే : బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం 5,340 క్వింటాళ్ల పంట ఉత్పత్తుల విక్రయాలు జరిగాయి. 160 క్వింటాళ్ల పత్తి రాగా.. క్వింటాలు రూ.5,002 నుంచి రూ.6,379 వరకు ధర పలికింది. 5,180 క్వింటాళ్ల మొక్కజొన్న విక్రయాలు నిర్వహించగా.. క్వింటాలు రూ.1,380 నుంచి రూ.2,477 ధర పలికింది. తడిసిన పంటను ఆరబెట్టి అమ్ముకుంటే మంచి ధరలు ఉంటాయని మార్కెట్ కార్యదర్శి నవీన్‌కుమార్ సూచించారు.

మొక్కజొన్న క్వింటాలు గరిష్ఠ ధర రూ.2,488

నవాబ్‌పేట, న్యూస్‌టుడే : మండలం కేంద్రంలోని బాలాజీ వ్యవసాయ మార్కెట్ యార్డుకు బుధవారం భారీగా ధాన్యం తరలివచ్చింది. మొక్కజొన్న 2,179 క్వింటాళ్లు, దొడ్డురకం వరి ధాన్యం 6 క్వింటాళ్లు వచ్చినట్లు మార్కెట్ సెక్రటరీ రమేష్ కుమార్ తెలిపారు. మొక్కజొన్న క్వింటాలు గరిష్ఠంగా రూ.2,488, కనిష్ఠ ధర రూ.2,290, దొడ్డు రకం వరి ధాన్యం క్వింటాలు రూ.2,107 పలికినట్లు చెప్పారు.

యువత ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



ప్రిన్సిపల్‌కు ఒప్పంద పత్రం అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

జడ్చర్ల పట్టణం, న్యూస్‌టుడే : కళాశాల యువత ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ సుకన్య సూచించారు. జడ్చర్లలోని డా.బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టీఎస్‌కేసీ-టీఏఎస్‌కే, మ్యాజిక్ బస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ విద్యా సంవత్సరంలో కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, ఎంప్లాయబిలిటీ స్కిల్స్‌పై అవగాహన కల్పించేందుకు ఒప్పందం చేసుకున్నారు. ప్రాజెక్టు మేనేజర్ పి.చందర్, టీఎస్‌కేసీ సమన్వయకర్త నాగలక్ష్మి, అకాడమిక్ సమన్వయకర్త శ్రీనివాసులు, టీఎస్‌కేసీ మెంటార్ వీరప్రతాప్, మ్యాజిక్ బస్ ప్రతినిధి ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు వేదికలో చోరీకి యత్నం

ధరూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో రైతు వేదికలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. రైతువేదికకు ఉన్న కిటికీ మెస్‌లను తొలగించి లోపలికి వెళ్లిన వ్యక్తులు సామగ్రిని చిందవందరగా పడేసినట్లు అధికారులు తెలిపారు. రైతు వేదికలో ఉన్న వీడియో కాన్ఫరెన్స్‌కు సంబంధించి సాంకేతిక వ్యవస్థ జోలికి వెళ్లలేదు. విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు వ్యవసాయ అధికారి శ్రీలత తెలిపారు.

జూరాల తిరుగుజలాల్లో మృతదేహం

ధరూరు, న్యూస్‌టుడే: ఖమ్మంపాడు గ్రామం సమీపంలో జూరాల తిరుగుజలాల్లో మృతదేహం కనిపించటంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై అబ్దుల్ షుకూరు సిబ్బందితో అక్కడి చేరుకొని నదిలో నుంచి బయటకు తీయించి గద్వాల ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడిని కర్ణాటక రాష్ట్ర యాదగిరి జిల్లా సైదాపూర్ మండలానికి చెందిన వాడిగా గుర్తించి బంధువులకు సమాచారం ఇచ్చారు. శవ పరీక్షల అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందించారు.

కోళ్లపందేలపై పోలీసుల దాడి

ధరూరు, న్యూస్‌టుడే: నెట్టెంపాడు గ్రామ సమీపంలో కోళ్ల పందేలు ఆడుతున్నారనే సమాచారం రావటంతో ధరూరు పోలీసులు దాడులు చేశారు. మొత్తం 7 మందిని అదుపులోకి తీసుకొని పది కోళ్లు, మూడు ద్విచక్రవాహనాలు, 5 చరవాణులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అబ్దుల్ షుకూర్ తెలిపారు.

యువకులపై కేసు నమోదు

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: అర్ధరాత్రి సమయంలో ద్విచక్ర వాహనాలపై ప్రజలను ఇబ్బందులకు గురిచేసేలా అతివేగంతో వెళ్తూ న్యూసెన్స్ చేస్తున్న గద్వాలకు చెందిన 8 మంది యువకులపై బుధవారం గద్వాల పట్టణ ఎస్సై కల్యాణ్‌కుమార్ చెప్పారు. ప్రజలకు ఏ రకంగానైనా ఇబ్బందులు కలిగించినా క్రిమినల్ కేసు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత



పాఠశాల పతాకాలతో క్రీడా సారథులు

కల్వకుర్తిపట్టణం, న్యూస్‌టుడే : చదువులతో పాటు క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పుర అధ్యక్షుడు ఎడ్మసత్యం అన్నారు. బుధవారం కల్వకుర్తి పట్టణంలోని ఎంజేపీ బాలికల గురుకుల విద్యాలయంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి గురుకుల క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరు తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో రాణించేందుకు నిత్య సాధన చేయాలన్నారు. చిన్నతనం నుంచే గెలుపు ఓటములను అలవర్చుకుంటే జీవితంలో ఎలాంటి ఒడిదొడుకులు వచ్చినా తట్టుకునే అవకాశం ఉంటుందన్నారు. పోటీలు నిర్వహించడం వల్ల ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్తుండటంతో అక్కడి పరిస్థితులు తెలుస్తాయని కొత్త మిత్రులు ఏర్పడతారన్నారు. ఓటమి చెందామని నిరుత్సాహపడకుండా గెలుపు కోసం ప్రయత్నించి క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. అంతకు ముందు విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించి క్రీడా జ్యోతిని వెలిగించారు. పోటీలను ప్రారంభించి విద్యార్థులను పరిచయం చేసుకున్నారు. మూడు రోజుల పాటు జరిగే పోటీల్లో ఉమ్మడి జిల్లాలోని 16 పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్‌సీవో వెంకట్‌రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమాశాఖ అధికారి ఖాజా నజీం ఆలీ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డా.నాగమణి, విశ్రాంత ప్రిన్సిపల్ కేశవులు పాల్గొన్నారు.

కోళ్లఫారాలకు రేషన్ బియ్యం



ద్విచక్రవాహనంపై దాణా సంచుల్లో బియ్యం తరలింపు

ధరూరు, న్యూస్‌టుడే: పీడీఎస్ బియ్యం కోళ్లఫారాలకు సరఫరా చేస్తున్నట్లు బుధవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. ధరూరు మండల కేంద్రంలో ఏజెంట్ల ద్వారా సేకరించిన బియ్యంను కోళ్లకు దాణా సరఫరా చేసే సంచుల్లో అనుమానం రాకుండా నింపి తరలిస్తున్నట్లు సమాచారం. ద్విచక్రవాహనంపై సంచుల్లో పీడీఎస్ బియ్యం గద్వాల-రాయచూరు దారికి ఆనుకొని ఉన్న కోళ్ల ఫారాలకు తరలిస్తున్న ఫొటోలు వైరల్ కావటం ధరూరులో చర్చనీయాంశంగా మారింది.